క్లుప్తంగా

రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి



మాయ పుస్తక పరిచయ సభలో పాల్గొన్న జానకిరామ్‌చౌదరి తదితరులు

కాకినాడ కల్చరల్: రచయిత గంటేడ గౌరినాయుడు రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని సాహితీ స్రవంతి నగరశాఖ అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి అన్నారు. స్థానిక రాజారామ్మోహన్‌రాయ్ వీధిలోని శాస్త్రి కళాప్రాంగణంలో సాహితీ స్రవంతి నగరశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు రచించిన మాయ (కథా సంపుటి) పుస్తక పరిచయ సభ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా అధ్యక్షతన జరిగింది. పల్లెజీవన విధానాన్ని అద్దంపట్టేలా గంటేడ రచనలు ఉంటాయని శాస్త్రి సేవాపీఠం అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి అన్నారు. అనంతరం కవిసమ్మేళనం జరిగింది. పి.పద్మజావాణి, జోస్యుల కృష్ణబాబు, గరికిపాటి మాస్టార్, డా.శైలజ, మణిబాబు, అద్దేపల్లి జ్యోతి, రామస్వామి తదితర రచయితలు పాల్గొన్నారు.

టౌన్‌హాల్ నూతన కార్యవర్గం ఎన్నిక



టౌన్‌హాల్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని టౌన్‌హాల్ కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవం జరిగాయి. అధ్యక్షులుగా జీఎస్ఎస్ మూర్తి (నానాజీ), కార్యదర్శిగా పాబోలు పున్నయ్య, ఉపాధ్యక్షులుగా జీవై రఘునాథ్ (రఘు), సంయుక్త కార్యదర్శిగా వీవీ సుబ్రహ్మణేశ్వరరావు, కోశాధికారిగా ఎం.సూర్యనారాయణరాజు, కార్యవర్గ సభ్యులుగా బి శివప్రసాద్, పి.రామచంద్రరావు, బసవా ప్రసాద్, ఎస్‌జీఆర్ సుబ్రహ్మణ్యం, ఎం సత్యనారాయణ, నెక్కంటి శ్రీనివాస్, బచ్చు శేఖర్, పీవీవీఎస్ఎన్ సతీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా జీవీ కృష్ణప్రకాష్, ఎస్వీ నరసింహారావు వ్యవహరించారు. కార్యదర్శి పాబోలు పున్నయ్య మాట్లాడుతూ మే 14న క్లబ్ డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభ్యుల సహకారంతో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.

నూకాలమ్మ తల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి వేచియున్న భక్తులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ బందోబస్తు ఏర్పాట్లు చూశారు. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ బేతపూడి రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 24 వరకూ గడువు ఉందన్నారు. అభ్యర్థులు 2021–23 విద్యా సంవత్సరంలో 3, 4వ తరగతులు చదివి ఉండాలని, తూర్పుగోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని వివరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 95665 59622 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

15 నుంచి చేపల వేట నిషేధం

తొండంగి: సముద్రంలో మత్స్యసంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకూ చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తోందని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. వేట నిషేధ సమయంలో నాటు పడవలు మినహా మోటార్ బోట్లు, మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట చేయరాదన్నారు. మండలంలోని మత్స్యకారులు చేపల వేట నిషేధానికి సహకరించాలని కోరారు. ఇప్పటికే దీనిపై మత్స్యకార గ్రామాల్లో ప్రచారం చేశామన్నారు. వేటనిషేధ సమయంలో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు.



నిర్మానుష్యంగా ఉన్న కరప-కొరిపల్లి రోడ్డు



కరప-కాకినాడ రహదారిలో పరిస్థితి..

సన్‌ధించాడు..

- భానుడి ప్రతాపానికి జనం బేజారు
- నిర్మానుష్యంగా రహదారులు

కరప: ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఆదివారం నాటి ఎండకు వృద్ధులు, చిన్నారులు, మహిళలు బేజారెత్తిపోయారు. 39, 40 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు ఉంటున్నాయని, రోజురోజుకూ ఎండలు పెరగడంతో తట్టుకోలేక పోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే కాకినాడ–రావులపాలెం, కాకినాడ–కోటిపల్లి ప్రధానరహదారులు కర్ఫ్యూని తలపిస్తున్నాయి. ఇప్పుడే ఎండతీవ్రత ఇలా ఉంటే మే నెలలో వచ్చే డొల్లు కర్తరి, నిజకర్తరి, రోహిణి కార్తెల్లో ఎండలతీవ్రత ఎలా ఉంటుందోనని గ్రామాల్లోని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎండలకు బయటకు రాలేక ప్రజలు అపసోపాలు పడుతున్నారు. మధ్యాహ్నం నుంచి రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వేసవి తీవ్రతకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సివస్తోందంటున్నారు. సాయంత్రం వేళల్లో శీతలపానీయాలు సేవించి ప్రజలు సేదతీరుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు చెట్లనీడకు చేరి ఉపశమనం పొందుతున్నారు. ఎండలకు జడిసి, శుభ కార్యాలకు వెళ్లాలంటేనే భయమేస్తోందని ప్రజలు అంటున్నారు. మధ్యాహ్న సమయంలో దుకాణాలు బంద్‌చేసి, సాయంత్రం తెరుస్తున్నామని వ్యాపారస్తులు తెలిపారు. రబీ కోతలు ప్రారంభమయ్యే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటే పనులు ముందుకు సాగక పెట్టుబడులు ఎక్కువయ్యేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హామీలు నెరవేర్చి ధైర్యంగా వచ్చాం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పెనుమర్తిలో 'జగనన్నే మా భవిష్యత్'



పెనుమర్తి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్న కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోనే ధైర్యంగా మీ ముందుకు వచ్చామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రజలకు వివరించారు. 'జగనన్నే మా భవిష్యత్'లో భాగంగా మండలంలోని పెనుమర్తి గ్రామంలో ఆదివారం పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి నుంచి 5 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళి ద్వారా అభిప్రాయం సేకరించారు. ఇంటింటికీ పోస్టర్లను అతికించి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ద్వారా అందజేసిన సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు గత ప్రభుత్వంలో చంద్రబాబు హామీలు ఇచ్చి ఏ విధంగా ప్రజలను నయవంచన చేశాడో వ్యత్యాసాన్ని తెలియజేశారు. మళ్లీ మా నమ్మకం నువ్వే జగనన్నా అని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యేగా తనకు ఆశీర్వాదం ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు.

పెనుమర్తిలో గడప గడపకూ..

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెనుమర్తి గ్రామంలో అధికారులతో కలిసి కురసాల కన్నబాబు ఆదివారం పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ పర్యటించి లబ్ధిదారులకు మూడేళ్లుగా వారు అందుకుంటున్న పథకాలను వివరించారు. సీఎంగా జగన్‌ను, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని అభ్యర్థించారు. అలాగే గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారులు, వీధిలైట్ల సమస్యలను వారు చెప్పడంతో ఎమ్మెల్యే అధికారులను వాటిని పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. సర్పంచ్ పెంకె ఆనంద్‌బాబు, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, వెల్లంగి సత్యవతి, వెల్లంగి భాస్కర రమేష్, ఎంపీటీసీ కొల్లా భాస్కరావు, పలివెల గోవిందు బాబు, కె.రాజబాబు, కాకరపల్లి అభిరామ్, వైఎస్సార్ సీపీ నాయకులు గోపిశెట్టి బాబ్జీ, తోటకూర శ్రీనివాస్, నందిపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. వాకలపూడి సచివాలయం–1 పరిధిలో గంపల రాణి, సత్యనారాయణ, ఎంజీకే రాజు తదితరులు ఆదివారం ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వైస్సార్ సీపీలోకి మాజీ ఎంపీటీసీ శ్యాంబాబు

మండలంలోని పెనుమర్తి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కాల్దారి శ్యాంబాబు అనుచరులతో కలిసి వైస్సార్ సీపీలో చేరారు. పెనుమర్తి గ్రామంలో ఆయన నివాసంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పార్టీ కండువా వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పనిచేసిన శ్యాంబాబు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల సంతృప్తి చెందడంతో వైస్సార్ సీపీలో చేరడం అభినందనీయం అన్నారు. గ్రామ స్థాయిలో సంక్షేమ పథకాలతో ప్రజలు ముఖ్యమంత్రి పట్ల సానుకూలంగా ఉన్నారని ప్రతి గ్రామంలోని వైస్సార్ సీపీ పటిష్టంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు కొనసాగనున్నట్లు కన్నబాబు తెలిపారు.



శ్యాంబాబుకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

మహనీయుల సేవలు ఆదర్శనీయం

కరప: మండలం వేళంగిలోని శ్రీనివాసా నర్సింగ్ హోమ్ ప్రాంగణంలో ఆదివారం లయన్ డాక్టర్ బొండా వెంకన్నారావు ఆధ్వర్యంలో సమతా మూర్తులైన స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే, భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల జయంతి ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వెంకన్నారావు ఇతర వక్తలు ఆ త్రిమూర్తుల జీవిత విశేషాలు వివరించి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం వారికి నివాళులు అర్పించారు. నవయుగ భారతి, జాగృతి సంపాదకులు డాక్టర్ వడ్డి విజయసారథి, సామాజిక సమరసత రాష్ట్ర సహకార కార్యదర్శి రాజారామచంద్ర, డాక్టర్ ఎస్.వీరభద్రరావు, దళిత రచయిత, బుద్ధిస్ట్ సవిలే రాజేష్, వేళంగి గ్రాడ్యుయేట్స్ అధ్యక్షుడు శాకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకన్నారావు

కాకినాడ కల్చరల్: స్వర్గీయులు బాబు జగ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావ్‌పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల సేవలు అదర్శనీయమని సర్వజన సమాజ్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వారి జయంతి వేడుకలను సమతా త్రిమూర్తులు పేరుతో నిర్వహించారు. ముందుగా వీరికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజాభివృద్ధిలో సమతా త్రిమూర్తుల పాత్ర కీలకమైనదని, ప్రముఖ సమాజ సేవకులు వడ్డి విజయ సారథి అన్నారు. పలువురు వక్తలు వీరు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేదిక ప్రతినిధి రాజారామచంద్ర, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమతా త్రిమూర్తులకు నివాళులు అర్పిస్తున్న సర్వజన సమాజ్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ రత్నాకర్ తదితరులు

ప్రభువు పునరుత్థానమైన రోజు..

- ఘనంగా ఈస్టర్ వేడుకలు

కాకినాడ కల్చరల్: ఏసు మరణాన్ని జయించి పునరుత్థానం పొందిన పవిత్ర దినం ఈస్టర్ అని హౌస్ ఆఫ్ హోలీ స్పిరిట్ చర్చి పాస్టర్ అబ్రహం పాల్ యాంగిచో అన్నారు. నగరంలో క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. హోలీస్పిరిట్ చర్చి సండేస్కూల్ చిన్నారులు ప్రదర్శించిన లఘు నాటికలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలలో చేశారు. యువతీ యువకులు ఆలపించిన క్రైస్తవ కీర్తనలు అలరించాయి. బెరాకా బ్లెస్సింగ్ చర్చి పాస్టర్ జోసఫ్ బెన్ని, హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో పాస్టర్ విజయకుమార్, సెయింట్ ఆన్స్ చర్చి, ఆంధ్రా బాపిస్టు చర్చి, జాన్‌క్రేగ్ చర్చి, రోమన్ కేథలిక్ చర్చి, క్రేగ్ ఇమ్మానుయేల్ బాపిస్టు చర్చి, సెయింట్ లూథరన్ చర్చి, సిటీ టాబర్నికల చర్చి, సిటీ చర్చిలో పాస్టర్స్ జీసస్ సందేశం ఇచ్చారు.

కరప: మండలంలో పాస్టర్లు, క్రీస్తు భక్తులు తెల్లవారుజామున సమాధులను దర్శించి, ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. చర్చిల్లో పునరుత్థాన కీర్తనలు ఆలపించారు. కరపలోని జీసస్ హౌస్ ప్రేయర్ మందిరంలో పాస్టర్ కె.అబ్రహం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రీస్తు నామాలతో ఊరేగారు. వేళంగిలో క్రైస్ట్ చాపల్ చర్చిలో పాస్టర్, రెవరెండ్ పి.సత్యప్రసాద్‌బాబు, నడకుదురులోని క్రైస్ట్ బిలీవర్స్ చర్చిలో మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఫాదర్ మేడపాటి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో, కరప ఫెయిత్‌గాస్పెల్ చర్చిలో బిషప్ కె.అబ్రహం శామ్యూల్, యండమూరు గాస్పెల్‌బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ ఐజే సూర్యప్రకాష్, వేళంగిలోని శ్రీమాన్ మెమోరియల్ చర్చిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముదుగు కృష్ణ, పట్టా కొండ, రమ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ పితాని అన్నవరం తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు చర్చిలలో ప్రేమవిందును ఏర్పాటుచేశారు. వివిధ గ్రామాల్లోని చర్చిల్లో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు, సెక్రటరీ కె.ఆనంద్‌బాబు, చైర్మన్ డాక్టర్ పి.శామ్యూల్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ జె.పాల్‌ప్రసాద్, జాయింట్‌సెక్రటరీ డి.ఏసురత్నం, జిల్లా జాయింట్ సెక్రటరీ ఐ.జాన్‌సూర్యప్రకాష్, డాక్టర్ స్టీఫెన్‌బాబు, వీవీ ఇమ్మానియేల్ తదితరులు ప్రార్థనలు చేశారు.

కాకినాడ రూరల్: ఈస్టర్ పండగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున సమాధులకు పూజలు చేశారు. ఏసుక్రీస్తులా మరణించిన తమ కుటుంబ సభ్యులు సమాధుల నుంచి బయటకు వస్తారని విశ్వసించి కొవ్వొత్తులను సమాధులపై ఉంచి ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రమణయ్యపేటలోని రేస్ ఆఫ్ పీస్ చర్చ్‌లో మత బోధకుడు, రెవరెండ్ మూర్తిరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొని తన సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో గోపుశెట్టి బాబ్జీ, గగారిన్ తదితరులు పాల్గొన్నారు.



నడకుదురు బిలీవర్స్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



రేస్ ఆఫ్ పీస్ చర్చిలో సందేశం ఇస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు. చిత్రంలో పాస్టర్ మూర్తిరాజు



కరపలో విశ్వాసులతో కలసి పాస్టర్ అబ్రహం ఊరేగింపు

కొమరిగిరిలో చురుగా ఇళ్ల నిర్మాణాలు

- సందర్శనకు త్వరలో బస్సులు ఏర్పాటు
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



కొమరగిరి లే అవుట్‌ను సందర్శించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: కొమరిగిరి లే అవుట్‌లో గృహనిర్మాణాలు వేగం పుంజుకున్నాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. త్వరలోనే ఆ ప్రాంతం మిని టౌన్‌షిప్ కానుందన్నారు. ఆదివారం ఆయన కొమరిగిరి లే అవుట్‌ను సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. మంజూరైన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. అక్కడ ఉన్న కాంట్రాక్టర్లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ సుమారు 5 వేల ఇళ్లు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత వాతావరణం ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా ఉన్నందున లబ్ధిదారులు వేగంగా ముందుకు వచ్చి ఇళ్లు కట్టుకోవాలని సూచించారు. కొమరిగిరి లే అవుట్‌లోనే ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల కోసం కుటీర పరిశ్రమలు కూడా ఏర్పాటు కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే అక్కడ జరుగుతున్న గృహనిర్మాణ ప్రగతిని పరిశీలించేందుకు కాకినాడ నుంచి బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకున్న పరిస్థితుల్లో అక్కడ పోలీస్ పికెట్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ జేడీ పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి హసన్ షరీఫ్



హసన్ షరీఫ్‌ను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- 50 మందితో పార్టీలో చేరిక
- ఆహ్వానించిన ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ సిటీ: వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ముస్లిం నాయకుడు హసన్ షరీఫ్ సుమారు 50 మందితో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక రేచర్లపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన తన అనుసరులు, మిత్రులతో కలసి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ముస్లిం, మైనారిటీల్లో చురుకైన పాత్ర వహిస్తున్న హసన్ షరీఫ్ వంటి నాయకుల చేరిక పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు. పార్టీలో కష్టించి పని చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఇటీవల కొత్తగా పదవులు పొందిన ముస్లిం మైనారిటీ నాయకులను ఎమ్మెల్యే ద్వారంపూడి సభకు పరిచయం చేశారు.

పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో ముస్లిం, మైనార్టీలకు ఎల్లప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు సీఎం జగన్ మైనార్టీల సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి, మాజీ మేయర్ శివప్రసన్న హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రెహమాన్‌ఖాన్, డైరెక్టర్లు కరీం, జాఫర్‌ఖాన్, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు బాషా, నగర అధ్యక్షుడు ఖాలీబ్ మిన్ వలీ, వ్యాపారవేత్త ఆలీషా, తొంపల తాతారావు, బత్తిన రాజు, శిగల మధు, బత్తుల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కరప: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు, ప్రాంతాల మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని కాకినాడ రమ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ పితాని అన్నవరం అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మండలం వేళంగిలో ఆదివారం క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లను ప్రారంభించారు. టోర్నీకి అవసరమయ్యే సామగ్రిని డాక్టర్ అన్నవరం సమకూర్చినట్టు నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు రెండు క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో వేళంగి నైట్ రైడర్స్, వేళంగి టైగర్స్ జట్ల మధ్య జరగగా వేళంగి టైగర్స్ గెలుపొందింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా కేదాసి సాయి నిలిచారు. రెండో మ్యాచ్‌లో వేళంగి లయన్స్‌పై వేళంగి వారియర్స్ గెలవగా, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సీహెచ్ సన్నీ నిలిచారు. వేళంగి గ్యాడ్యుయేట్ యూత్ ప్రతినిధులు ఎర్రా విక్రమ్, ముడిగి కృష్ణ, చిట్టూరి అప్పన్న, ఎ.దుర్గాప్రసాద్ తదితరులు టోర్నీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న డాక్టర్ అన్నవరం

జ్యూవల్ మెడోస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద జ్యూవల్ మెడోస్ అపార్టుమెంట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కంతేటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. రెండేళ్లపాటు నూతన కార్యవర్గం పదవిలో కొనసాగించేందుకు నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఏఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శిగా అనిశెట్టి సత్తిబాబు, సంయుక్త కార్యదర్శిగా పిట్టల నాగేశ్వరరావు, కోశాధికారిగా రెడ్డి వివేక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ జ్యూవల్ మెడోస్ గేటెడ్ కమ్యూనిటీలో 280 కుటుంబాలు ఉంటున్నాయన్నారు. ఆయా కుటుంబాలకు స్నేహపూర్వక వాతావరణంలో ఉండడంతో పాటు ఒకరికి ఒకరు సహాయపడేలా వారి సమస్యలు పరిష్కరించేందుకు అసోసియేషన్ నూతన పాలకవర్గం కృషి చేస్తుందన్నారు.



అసోసియేషన్ నూతన పాలకవర్గం సభ్యులు

సమాజ సేవతో జీవితం చరితార్థం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): సమాజ సేవ, ఆధ్యాత్మిక సూక్తులను ఆచరించి జీవితాన్ని చరితార్థం చేసుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. కాకినాడలోని రంగాసాయి మండపంలో ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాల్యం నుంచి మానవతా విలువలను పెంపొందించే సత్యసాయి బాలవికాస్ తరగతులకు తమ పిల్లలను పంపించాలని తల్లితండ్రులను కోరారు. సత్యసాయి ఆరాధన దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న అన్నదానం నిర్వహించాలన్నారు. సేవా సంస్థల సంస్కృతిక వ్యవహారాల భజనల సమన్వయ కర్త ఎమ్మెస్ ప్రకాశరావు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు రోజులో కొంత సమయాన్ని సామూహిక భజనలు చేయడం, మృదు మధురమైన సంభాషణ చేయాలన్నారు. సేవా సమితి జిల్లా అధ్యక్షుడు యర్లగడ్డ గోవిందరాజులు, సేవా సమితి కన్వీనర్ అశోక్, సీనియర్ సమన్వయ కర్తలు ఉషారాణి, శ్యామల, పద్మజ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

ముస్లింలకు అండగా ఉంటాం

- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రంజాన్ సందర్భంగా రమణయ్యపేట మసీద్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ ఉపవాస ప్రార్థనల్లో పాల్గొంటున్న ముస్లింలకు అల్లా ఆశీస్సులు ఉండాలని, ముస్లింలకు ప్రభుత్వ పరంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండ ఉంటుందన్నారు. వారి కోసం అనేక సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు పలు విన్నపాలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేయగా పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. మసీదుపై ఫ్లోర్ నిర్మాణానికి పన్ను తగ్గేలా కమిషనర్‌తో మాట్లాడతానని, పార్కింగ్ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు గోపిశెట్టి బాబ్జీ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ ఇమ్రాన్, జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి కరీం బాషా, ఎస్‌కే అహ్మద్ అలీ, మసీద్ ప్రెసిడెంట్ ఎంఏ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ రియా ఉద్దీన్, సెక్రటరీ ఎండి సందాని ముస్లింలు పాల్గొన్నారు.

రత్నగిరిపై సూర్య నమస్కారాలు

అన్నవరం: రత్నగిరి కళావేదికపై ఆదివారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.